క్లుప్తంగా

ఎమ్మెల్యే పల్లాకు ఆహ్వానం



ఆహ్వాన పత్రిక అందిస్తున్న యువకులు

చేర్యాల(సిద్దిపేట): మండలంలోని ఆకునూరులో ఏర్పాటు చేసిన శివాజీ మహారాజ్ విగ్రహ ఆవిష్కరణకు రావాలని ఆ గ్రామ యువకులు జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డిని ఆహ్వానించారు. సోమవారం హైదరాబాద్‌లో ఆయనను కలిసి 19వ తేదీన జరగనున్న విగ్రహావిష్కరణ ఆహ్వాన పత్రికను అందజేశారు. గణేశ్, లక్ష్మణ్, బాలరాజు, మహేశ్, హరి తదితరులు ఉన్నారు.

రైతుల ధర్నా



ధర్నా చేస్తున్న రైతులు

హుస్నాబాద్‌రూరల్: వ్యవసాయ మార్కెట్‌లో కందులు కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ పలువురు రైతులు ఏఎంసీ ఎదుట సోమవారం ధర్నా చేశారు. పదిరోజుల నుంచి మార్కెట్‌లో కందులు పోసినా ఆన్‌లైన్‌లో పంట నమోదు లేదని కొనుగోలు చేయడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో ఎకరాకు ఆరు క్వింటాళ్లు కొనుగోలుచేస్తే ఇప్పుడు ఎకరాకు మూడు క్వింటాళ్లే కొనుగోలు చేసే నిబంధనను తొలగించాలని డిమాండ్ చేశారు. రైతులు రవీందర్, రాజు పాల్గొన్నారు.

ముగిసిన వాలీబాల్ పోటీలు



విజేతగా నిలిచిన వాలీబాల్ జట్టు

హుస్నాబాద్‌రూరల్: మండలంలోని గాంధీనగర్‌లో రెండు రోజులుగా నిర్వహించిన వాలీబాల్ క్రీడా పోటీలు సోమవారంతో ముగిశాయి. టోర్నమెంట్‌లో పదిజట్లు పాల్గొనగా రాంబాబు జట్టు విజేతగా నిలిచింది. ప్రథమ బహుమతి కింద ట్రోఫీతోపాటు రూ.5వేల నగదును నిర్వాహకులు అందించారు. త్వరలో మూడు జిల్లాల స్థాయి టోర్నమెంట్ నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పాపారావు, మాజీ సర్పంచ్‌లు సంపత్, శ్రీనివాస్, కోచ్ వెన్న రాజు పాల్గొన్నారు.

భూంపల్లి యువత భరోసా



ఆర్థిక సాయం అందిస్తున్న యువకులు

మిరుదొడ్డి(దుబ్బాక): ఇటీవల మృతి చెందిన స్థానిక అతికం బాలమణి కుటుంబ సభ్యులకు భూంపల్లి యువకులు ఆర్థిక సాయం చేసి భరోసా ఇచ్చారు. ఆమె కొడుకు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్నాడు. అలాగే భర్త సంబంధిత వ్యాధితో బాధ పడుతున్నాడు. ఈ క్రమంలో సుమారు 50 మంది యువకులు సోమవారం మృతురాలి భర్త ఏదుల్ గౌడ్‌ను పరామర్శించారు. రూ.30వేల ఆర్థిక సాయంతో పాటు, 50కిలోల బియ్యం అందించారు. ప్రభాకర్, కృష్ణ హరి, రాజు, పరశురాములు, కిషన్, గణేశ్, రామస్వామి, గోవర్ధన్, స్వామి తదితరులు పాల్గొన్నారు.

ఇసుక రవాణాకు అడ్డుకట్ట



జేసీబీతో కందకం తవ్వకం

బెజ్జంకి(సిద్దిపేట): మండలంలోని గాగిల్లాపూర్, తోటపల్లి శివారులోని మోయతుమ్మెద వాగు నుంచి ఇసుక అక్రమ రవాణా నిరోధించడానికి రెవెన్యూ, పోలీసుల ఆధ్వర్యంలో రోడ్లపై కందకాలు తవ్వించారు. వాగులోకి ట్రాక్టర్‌లు, లారీలు, జేసీబీలు వెళ్లకుండా కఠిన చర్యలు తీసుకుంటున్నట్లు తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి, ఎస్‌ఐ కృష్ణారెడ్డి తెలిపారు.

నేడు విద్యుత్‌కు అంతరాయం

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): పట్టణంలోని 132/33 కేవీ సిద్దిపేట సబ్‌స్టేషన్ మరమ్మతుల కారణంగా మంగళవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని పట్టణ అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ సుధాకర్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కోటిలింగాల ఆలయం, రాఘవేంద్రనగర్, ముర్షద్‌గడ్డ, కాళ్లకుంట కాలనీ, వడ్డెరకాలనీ తదితర ప్రాంతాలలో ఉదయం 9.30 ని.ల నుంచి 10.30 ని.ల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని తెలిపారు.

తెలంగాణ సాధకుడు కేసీఆర్



మర్కూక్(గజ్వేల్): కేసీఆర్ జన్మదిన వేడుకల్లో ఆర్థిక సాయం అందిస్తున్న బీఆర్ఎస్ నాయకులు



సిద్దిపేటజోన్: కేక్ కట్‌చేస్తున్న రాజనర్స్, సంపత్ రెడ్డి తదితరులు



హుస్నాబాద్‌లో జరిగిన వేడుకల్లో మాజీ మున్సిపల్ చైర్మన్ రజిత తదితరులు



చేర్యాల(సిద్దిపేట): కేసీఆర్‌కు పుష్పగుచ్ఛం ఇచ్చి శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్యే పల్లా

మాజీ సీఎం కేసీఆర్ జన్మదిన వేడుకలు జిల్లా వ్యాప్తంగా ఘనంగా జరిగాయి. సోమవారం ఆయన జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని పలువురు బీఆర్ఎస్ నాయకులు కేసీఆర్‌ను కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ రాష్ట్ర సాధకుడు కేసీఆర్ అంటూ కొనియాడారు. అనంతరం వివిధ చోట్ల కేక్‌లు కట్‌చేసి తినిపించుకున్నారు. ఆసుపత్రుల్లో పండ్లు పంపిణీ చేశారు. ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.



చిన్నకోడూరులో కేక్ కట్‌చేస్తున్న బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి రాధాకృష్ణశర్మ తదితరులు



గజ్వేల్: పోస్టల్ బాండ్లను అందజేస్తున్న శ్రీనివాస్



ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): దివ్యాంగుడికి వీల్ చైర్ అందజేస్తున్న ఈర్షత్



సిద్దిపేటకమాన్: ప్రభుత్వాసుపత్రిలో పండ్లు పంపిణీ చేస్తున్న నాయకులు

నిబంధనలు ఉల్లంఘించే వారిపై నజర్

ట్రాఫిక్ ఏసీపీ సుమన్‌కుమార్

సిద్దిపేటకమాన్: రోడ్డు నిబంధనలు ఉల్లంఘించి వాహనాలు నడిపే వారిపై దృష్టి సారించాలని ట్రాఫిక్ ఏసీపీ సుమన్‌కుమార్ సిబ్బందిని ఆదేశించారు. సోమవారం ఆయన సిబ్బందికి ట్రాఫిక్ విధులు గురించి దిశా నిర్దేశం చేశారు. అనంతరం మాట్లాడుతూ.. సిబ్బంది సక్రమంగా విధులు నిర్వహించాలన్నారు. రోడ్డుపై పార్కు చేసే వాహనదారులకు కౌన్సిలింగ్ నిర్వహించాలని సూచించారు. హెల్మెట్ లేకుండా వాహనాలు నడిపేవారు. ట్రిపుల్ రైడింగ్, మైనర్ డ్రైవింగ్ చేసేవారిపై దృష్టి సారించాలని చెప్పారు. మొబైల్ వాహనంలో తిరుగుతూ పబ్లిక్ అడ్రసింగ్ సిస్టం ద్వారా హెచ్చరికలు చేయాలని, రోడ్లపై భారీ వాహనాలను పార్కు చేయకుండా చూడాలని కోరారు. సమావేశంలో ఏఎస్‌ఐ సదాశివరావు, హెడ్ కానిస్టేబుళ్లు సత్యం, రాజిరెడ్డి, కానిస్టేబుళ్లు గోపాల్, జగదీశ్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

45 మందికి కౌన్సెలింగ్

మద్యం తాగి వాహనాలు నడపుతూ పట్టుపడిన 45 మంది వాహనదారులకు ఏసీపీ సుమన్‌కుమార్ స్టేషన్‌లో కౌన్సెలింగ్ నిర్వహించారు. మద్యం తాగి వాహనాలు నడపబోమని వారి చేత ప్రతిజ్ఞ చేయించారు.



వాహనదారులకు కౌన్సెలింగ్ ఇస్తున్న సుమన్‌కుమార్

ప్రమాదాలను నివారిద్దాం

గజ్వేల్‌రూరల్: ట్రాఫిక్ నిబంధనలు పాటించి రోడ్డు ప్రమాదాలను నివారిద్దామని సెయింట్ మేరీస్ విద్యానికేతన్ ప్రిన్సిపాల్స్ రాయప్ప, విజయపాల్ రెడ్డి విద్యార్థులకు సూచించారు. సర్వజన ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రజ్ఞాపూర్‌లోగల విద్యానికేతన్‌లో సోమవారం రోడ్డు నిబంధనలపై అవగాహన కల్పించారు. ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు, స్కూల్ బస్సు డ్రైవర్లు, క్లీనర్లు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శిని సస్పెండ్ చేయాలి

అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్‌కు ఎమ్మార్పీఎస్ నాయకుల వినతి

ములుగు(గజ్వేల్): మాదిగ మహిళలను కించపరిచిన మండలంలోని వాగునూతి గ్రామ కార్యదర్శి మంజులను తక్షణమే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేస్తూ ఎంఎస్పీ జిల్లా అధ్యక్షుడు పెర్క పరశురాములు, ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు బుడిగె మహేశ్ తదితరులు అదనపు కలెక్టర్ గరీమ అగర్వాల్‌కు సోమవారం వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆంజనేయులు, ములుగు, జగదేవ్‌పూర్, వర్గల్ మండలాల అధ్యక్షులు మహేశ్, రాజు, నవీన్, వెంకటేశ్ పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

కల్యాణం.. కమనీయం

మద్దూరు(హుస్నాబాద్): బెక్కల్ రామలింగేశ్వర స్వామి ఆలయ బ్రహ్మోత్సవాలలో భాగంగా భ్రమరాంబ సహిత రామలింగేశ్వరస్వామి కల్యాణం సోమవారం వైభవంగా నిర్వహించారు. ఉదయం 6 గంటలకు స్వామికి గంగస్నానం చేయించారు. ఆలయ చైర్మన్ మల్లేశం రామలింగేశ్వరస్వామి కల్యాణోత్సవానికి ముత్యాల తలంబ్రాలు, పట్టు వస్త్రాలు అందజేశారు. ప్రధాన అర్చకుడు సిద్దాపురం శివప్ప వైదిక నిర్వహణలో అర్చకులు మఠం శివకుమార్, సిద్దాపురం భద్రప్ప శాస్త్రోక్తంగా నిర్వహించారు. చైర్మన్ మల్లేశం దంపతులు వధూవరుల తరపున కల్యాణం జరిపించారు. మహిళలు అమ్మవారికి ఒడి బియ్యం పోసి మొక్కులు చెల్లించుకున్నారు. మాజీ ఎమ్మెల్సీ రాజలింగం, చేర్యాల మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ జీవన్‌రెడ్డి, ఆలయ డైరెక్టర్లు శోభపురుషోత్తంరెడ్డి, బ్రహ్మచారి, సాంబయ్య, మల్లేశం, సరిరాం, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సాయిలు, బెక్కల్ ఆలయ మాజీ చైర్మన్ రాములుగౌడ్ పాల్గొన్నారు.



భక్తులకు మాంగల్యాన్ని చూపుతున్న అర్చకుడు

సీతరామచంద్ర స్వామి ఆలయంలో..

నంగునూరు(సిద్దిపేట): తోకలకొండపై వెలసిన సీతరామచంద్ర స్వామి ఆలయంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం కనుల పండువగా కల్యాణం నిర్వహించారు. సాయినాథ్ శర్మ నేతృత్వంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ రమేశ్‌గౌడ్ దంపతులు పట్టు వస్త్రాలు సమర్పించారు. సాయంత్రం అన్నదానం నిర్వహించి, దాతలకు సన్మానం చేశారు.



కల్యాణం నిర్వహిస్తున్న సాయినాథశర్మ

వినూత్న పద్ధతుల్లో బోధన అవసరం

ఎంఈఓ బచ్చలి సత్తయ్య



బుక్‌లెట్లను విడుదల చేస్తున్న ఎంఈఓ

కొండపాక(గజ్వేల్): ప్రాథమిక స్థాయి నుంచే వినూత్న పద్ధతుల్లో బోధనలు చేసుకోవాలని మండల విద్యాధికారి బచ్చలి సత్తయ్య సూచించారు. కుకునూరుపల్లిలోని హైస్కూల్లో కాంప్లెక్స్ పరిధిలోని ఉపాధ్యాయులకు బయోలాజికల్ సైన్స్‌పై బిట్ ప్రశ్నల గురించి సోమవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఇంట్రాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్(ఐఎఫ్‌పీ) పనివిధానంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సత్తయ్య మాట్లాడుతూ వినూత్న పద్ధతుల్లో బోధించడం అవసరం అన్నారు. అప్పుడే విద్యార్థుల్లో ఏకాగ్రత, ఆసక్తి పెరుగుతాయని చెప్పారు. 10వ తరగతిలో బయోసైన్స్‌లో సులభంగా అర్థం అయ్యేలా తయారు చేసిన బుక్‌లెట్లను ఉపాధ్యాయులకు అందజేశామని, పాఠశాలలో అమర్చిన ఐఎఫ్‌పీ ద్వారా పాఠ్యాంశాల బోధించాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన విగ్రహ ప్రతిష్ఠ



కల్యాణం నిర్వహిస్తున్న పురోహితులు

హుస్నాబాద్: పట్టణంలోని నూతనంగా నిర్మించిన వెంకటేశ్వరస్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు సోమవారం స్వామి వారి కల్యాణంతో ముగిశాయి. ప్రత్యేక పూజలు నిర్వహించి ఘనంగా కల్యాణం జరిపించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు మంతెన ప్రభాకర్‌రావు, మాజీ ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రజాపాలన సేవా కేంద్రం ప్రారంభం

అక్కన్నపేట(హుస్నాబాద్): ప్రజలకు సేవలు అందించేందుకు ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం ప్రజాపాలన సేవా కేంద్రాన్ని డీఎల్‌పీఓ వెంకటేశ్వర్లు, ఎంపీడీఓ భానోతు జయరాం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. 16వ తేదీ నుంచి 28వ తేదీ వరకు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 వరకు సేవలు అందుబాటులో ఉంటాయని, కులగణన సర్వేలో పాల్గొని వారు నేరుగా వారి వివరాలను నమోదు చేసుకోవాలని కోరారు. అదేవిధంగా ప్రభుత్వం ప్రకటించిన టోల్ ఫ్రీ నంబరు 040-21111111కు ఫోన్‌చేసి తమ వివరాలను పొందుపర్చాలని సూచించారు.



కేంద్రాన్ని ప్రారంభిస్తున్న వెంకటేశ్వర్లు, జయరాం

విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ



కొమురవెల్లి(సిద్దిపేట): స్వయం పరిపాలనలో పాల్గొన్న విద్యార్థులు, ఉపాధ్యాయులు



సిద్దిపేటఅర్బన్: ఉపాధ్యాయులతో విద్యార్థులు

కొమురవెల్లి(సిద్దిపేట)/తొగుట(దుబ్బాక)/సిద్దిపేటఅర్బన్: వివిధ పాఠశాలల్లో విద్యార్థులు స్వయం పాలన దినోత్సవాన్ని సోమవారం ఉత్సాహంగా నిర్వహించారు. కొమురవెల్లి మండలంలోని పోసాన్‌పల్లి, తొగుట మండలంలోని బండారుపల్లి, సిద్దిపేటఅర్బన్ మండలంలోని బక్రిచెప్యాల పాఠశాలల్లో విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. డీఈఓలు, హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులుగా అలరించారు. ఉత్తమంగా బోధించిన వారికి ఉపాధ్యాయులు బహుమతులు అందజేశారు. ఆయా కార్యక్రమాల్లో హెచ్‌ఎం సంధాని, విద్యా కమిటీ చైర్మన్ పద్మ, ఉపాధ్యాయులు జనార్దన్, స్వప్న, తరన్నుం, నజీర్, నాజియ తదితరులు పాల్గొన్నారు.

పీఆర్టీయూ అభ్యర్థికి సంఘీభావం

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): ఉమ్మడి కరీంనగర్, నిజామాబాద్, మెదక్, ఆదిలాబాద్ జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థిగా పీఆర్టీయూ బలపర్చిన వంగ మహేందర్‌రెడ్డిని గెలిపిద్దామని వివిధ ఉపాధ్యాయ, అధ్యాపక సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక పీఆర్టీయూ భవన్‌లో టీఆర్టీఎఫ్, గెజిటెడ్ హెచ్‌ఎంల సంఘం, భాషోపాధ్యాయ సంఘం, ఆర్‌యూపీపీ, గెజిటెడ్ అధ్యాపకుల సంఘం, పీఈటీటీఎస్, మోడల్ స్కూల్ జిల్లా సంఘం, ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం, కేజీబీవీ ఉపాధ్యాయుల సంఘాల నాయకులు తమ సంఘీభావం తెలిపారు.



సంఘీభావం తెలుపుతున్న వివిధ సంఘాల నాయకులు

సమర్థులైన వారినే ఎన్నుకోవాలి

సిద్దిపేటకమాన్: సమర్థులైన విద్యావంతులను ఎమ్మెల్సీగా ఎన్నుకోవాలని ధర్మ సమాజ్ పార్టీ అధినేత విశారధన్ మహరాజ్ అన్నారు. సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ధర్మ సమాజ్ పార్టీ అభ్యర్థి మంద జ్యోతికి మొదటి ప్రాధాన్యత ఓటువేసి గెలిపించాలన్నారు. కార్యక్రమంలో లక్ష్మణ్, శ్రీకాంత్, రవిబాబు, సుమన్, పరమేశ్వరి, ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్‌రెడ్డి

కోహెడరూరల్(హుస్నాబాద్): మెదక్ ఆదిలాబాద్ నిజామాబాద్ కరీంనగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ కాంగ్రెస్ అభ్యర్థి నరేందర్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని యువజన కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి జీవన్‌రెడ్డి ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు.

సీపీఐ ప్రచారం

బెజ్జంకి(సిద్దిపేట): కరీంనగర్, మెదక్, ఆదిలాబాద్, నిజామాబాద్ జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీగా కాంగ్రెస్ అభ్యర్థి ఉట్కూరి నరేందర్‌రెడ్డిని గెలిపించాలని కోరుతూ సీపీఐ మండల కార్యదర్శి బొనగిరి రూపేశ్ ఆధ్వర్యంలో వీఎస్‌ఆర్ టీం సభ్యులు సోమవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు.

జేఏసీ మద్దతులేదు

హుస్నాబాద్: కాంగ్రెస్ పార్టీ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్‌రెడ్డికి జేఏసీ మద్దతు ఇవ్వడం లేదని జేఏసీ నియోజకవర్గ కో కన్వీనర్ కోయ్యడ కొమురయ్య సోమవారం ప్రకటనలో పేర్కొన్నారు. బలహీన వర్గాల అభ్యర్థికే మద్దతు ఇవ్వాలని కొందరు నిర్ణయించారని తెలిపారు.

మొదటి ప్రాధాన్యత ఓటువేసి గెలిపించాలి

సిద్దిపేటకమాన్: పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా దళిత బహుజన పార్టీ, రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా, ఎస్సీఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థి సంఘాల ఉమ్మడి అభ్యర్థిగా గవ్వల శ్రీకాంత్ పోటీలో ఉన్నారని మాలమహానాడు జాతీయ కమిటీ గౌరవాధ్యక్షుడు, సుప్రీంకోర్టు న్యాయవాది కృష్ణస్వరూప్ అన్నారు. సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికల్లో శ్రీకాంత్‌కు మొదటి ప్రాధాన్యత ఓటువేసి గెలిపించాలన్నారు. అశోక్, మహేశ్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ మందుబాబులకు జరిమానా

సిద్దిపేటకమాన్: మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడిన వాహనదారులకు సిద్దిపేట కోర్టు జరిమానా విధించింది. ట్రాఫిక్ సీఐ ప్రవీణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని పలు ప్రాంతాలలో తమ సిబ్బందితో కలిసి వారం రోజుల క్రితం నిర్వహించిన వాహన తనిఖీల్లో 13 మంది పట్టుబడ్డారు. వారిని కోర్టులో హాజరుపర్చగా విచారణ జరిపిన న్యాయమూర్తి రూ.22,500 జరిమానా విధించినట్లు సీఐ తెలిపారు.

◆ 28,866 మంది ఓటర్లు

బెజ్జంకి(సిద్దిపేట): ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల కోసం పోలింగ్ కేంద్రాల, ఓటర్ల తుది జాబితా రూపొందించినట్టు ఇన్‌చార్జి ఎంపీడీఓ మంజుల తెలిపారు. మండలంలో పది ఎంపీటీసీ స్థానాలకు గాను 60 పోలింగ్ స్టేషన్‌లు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. మొత్తం 28,866 ఓట్లు ఉన్నాయని, వాటిలో 13,999 మంది పురుషులు, 14,867 మంది మహిళలు ఉన్నట్టు తెలిపారు. ఓటర్లలో పురుషుల కన్నా మహిళా ఓటర్లు 868 మంది ఎక్కువ ఉన్నారని చెప్పారు. .

◆ జీవితాలను నాశనం చేసుకోవద్దు

కొమురవెల్లి(సిద్దిపేట): యువత తాత్కలిక ఆనందం కోసం జీవితాలను నాశనం చేసుకోవద్దని ఎస్‌ఐ రాజుగౌడ్ పిలుపునిచ్చారు. మల్లికార్జున స్వామి ఆలయ పరిసరాలలో సోమవారం కిరణా దుకాణాలు, పాన్‌షాప్‌లు, ఇతర అనుమానిత ప్రాంతాలలో నార్కోటిక్స్ డాగ్స్‌తో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శివరాత్రి సందర్భంగా ఆలయంలో నిర్వహించే పెద్దపట్నం కార్యక్రమానికి వచ్చే భక్తులకు ఇబ్బంది కలుగకుండా తనిఖీలు నిర్వహించామన్నారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

◆ పోస్టర్ ఆవిష్కరణ

చిన్నకోడూరు(సిద్దిపేట): విద్యుత్ సంస్థల్లో పనిచేస్తున్న ఆర్టిజన్ కార్మికులను కన్వర్షన్ చేయాలని డిమాండ్ చేస్తూ 20న హైదరాబాద్‌లో నిర్వహించనున్న చలో విద్యుత్ సౌధ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు భాస్కర్ పిలుపునిచ్చారు. సోమవారం చిన్నకోడూరులో కార్యక్రమానికి చెందిన పోస్టర్‌లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్హతను బట్టి పదోన్నతులు కల్పించాలన్నారు. సమస్య పరిష్కారమయ్యే వరకు ఆందోళనలు కొనసాగిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో రాంరెడ్డి, శ్రీనివాస్, సతీశ్, రవి, కొమురయ్య తదితరులు పాల్గొన్నారు.

◆ ప్రసన్న హరికృష్ణ గెలుపు ఖాయం

కోహెడ(హుస్నాబాద్): ఆదిలాబాద్, నిజాంబాద్, కరీంనగర్, మెదక్ పట్టభద్రుల ఎమ్మెల్సీ పులి ప్రసన్న హరికృష్ణకు మద్దతుగా బీఎస్పీ ఆధ్వర్యంలో సోమవారం కోహెడలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా బీఎస్పీ నాయకులు మాట్లాడుతూ ప్రసన్న హరికృష్ణ గెలుపు ఖాయం అన్నారు. మొదటి ప్రాధాన్యత ఓటువేసి భారీ మెజార్టీతో గెలిపించాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో రవీందర్, రాజు, శంకర్, మహేశ్‌బాబు, శ్రీకాంత్, ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

◆ చర్యలు తీసుకోవాలని ఆందోళన

సిద్దిపేటజోన్: పట్టణ శివారులోని శ్రీచైతన్య పాఠశాలలో విద్యార్థులపై టీచర్ మధు అనుసరించిన వైఖరిని నిరసిస్తూ పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీకాంత్ ఆధ్వర్యంలో పాఠశాల ఎదుట సోమవారం ఆందోళన నిర్వహించారు. పాఠశాల యాజమాన్యం టీచర్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

◆ నేడు ధ్యానక్షేత్రం వార్షికోత్సవం

గజ్వేల్‌రూరల్: ధ్యానంతోనే మానసిక ప్రశాంతత చేకూరుతుందని పీఎస్ఎస్ఎం(పిరమిడ్ స్పిరచ్యువల్ సొసైటీ ఆఫ్ మూవ్‌మెంట్)గజ్వేల్ శాఖ అధ్యక్షుడు పాశికంటి నర్సింహులు అన్నారు. మండల పరిధిలోని ధర్మారెడ్డిపల్లిలోని శ్రీపాండవకృష్ణ ధ్యానక్షేత్రం ఏడో వార్షికోత్సవం మంగళవారం నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కార్యక్రమానికి ధ్యానులంతా తరలిరానున్నట్లు తెలిపారు.

◆ పండ్లు, నోట్‌బుక్స్ పంపిణీ

అక్కన్నపేట(హుస్నాబాద్): మాజీ సీఎం కేసీఆర్ జన్మదినాన్ని పురస్కరించుకొని మండలం పంతుల్‌తండాలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ పిల్లలకు పండ్లు, నోట్ పుస్తకాలను గ్రామశాఖ అధ్యక్షుడు ధరావత్ విజయ్ ఆధ్వర్యంలో మాజీ ఎంపీపీ మాలోతు లక్ష్మీభీలునాయక్, మాజీ జెడ్పీటీసీ సభ్యురాలు భూక్య మంగ చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో సాంబరాజు తదితరులు పాల్గొన్నారు.

◆ నూతన నియామకం

బెజ్జంకి(సిద్దిపేట): మండలంలోని గాగిల్లాపూర్‌లోని ధ్యాననిష్టాశ్రమ చారిటబుల్ ట్రస్ట్ నూతన కమిటీని సోమవారం ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. అధ్యక్షుడిగా అరకొంతం మల్లారెడ్డి, ఉపాధ్యక్షుడిగా ఎగుర్ల కనుకయ్య, బద్దం శ్రీనివాస్‌రెడ్డి, కోశాధికారిగా అన్నాడి రాంరెడ్డితో పాటు 16 మంది కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎంపికయ్యారు.